సాక్షి
పశ్చిమగోదావరి

బుధవారం । 1 । మార్చి । 2023



మద్ది అంజన్నకు ప్రత్యేక పూజలు

జంగారెడ్డిగూడెం రూరల్: మద్ది ఆంజనేయస్వామిని మంగళవారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. తమలపాకులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



మావుళ్లమ్మకు బంగారం సమర్పణ

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం ఇలవేల్పు మావుళ్లమ్మవారికి పట్టణానికి చెందిన మణికంఠ పవన్‌కుమార్ మంగళవారం 8 గ్రాముల బంగారం సమర్పించారు.



ఎరువుల దుకాణాల తనిఖీ

పెనుగొండ: మార్టేరు వ్యవసాయ శాఖ పరిధిలో ఎరువులు, పురుగుమందుల దుకాణాల్ని మంగళవారం తనిఖీచేశారు. లైసెన్సులు, బిల్ పుస్తకాలు, నిల్వలు పరిశీలించారు.

న్యూస్‌రీల్

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు



పాలకొల్లు మండలం వెంకటాపురంలో తల్లి దండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్న అధికారులు

పాలకొల్లు అర్బన్: వివాహ వయస్సు దాటకుండా అమ్మాయికి పెళ్లి చేయడం వలన అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పసుపులేటి సత్యవేణి అన్నారు. పాలకొల్లు మండలం వెంకటాపురంలో బాలికకు పెళ్లి చేసేందుకు సిద్ధపడుతున్న తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించి వివాహాన్ని వాయిదా వేయించారు. వెంకటాపురం గ్రామానికి చెందిన యువకుడికి లంకలకోడేరు పంచాయతీ పరిధిలోని వెదుళ్లపాలెంకి చెందిన బాలికతో వివాహం నిశ్చయమైంది. మార్చి 11న వివాహం చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. బాలిక 9వ తరగతి చదువుతున్నట్లు పోడూరు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులకు సమాచారం అందింది. దీంతో అధికారులు అప్రమత్తమై ఇద్దరు కుటుంబ సభ్యులను ప్రత్యేకంగా కలిసి అవగాహన కల్పించారు. రూరల్ పోలీస్ స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ చింతపల్లి వెంకట నారాయణమూర్తి, వీఆర్వో డి.నాగరాజు తదితరులు యువతీ, యువకుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

అరుణాచలం గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సులు



తాడేపల్లిగూడెం (టీఓసీ): అరుణాచలం గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు, భక్తులు బస్సులను సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎస్ఆర్టీసీ తాడేపల్లిగూడెం డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణ మూర్తి తెలిపారు. పట్టణంలో మంగళవారం ఆయన వివరాలు వెల్లడిస్తూ బస్సులో పుష్ బ్యాక్ 2+2 సీట్లతో సూపర్ లగ్జరీ బస్సు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మార్చి 5న రాత్రి 7 గంటలకు గూడెం బస్సు స్టేషన్ నుంచి బస్సు బయలుదేరి 6న ఉదయం శ్రీకాళహస్తి దర్శనం, మధ్యాహ్నం కాణిపాక విఘ్నేశ్వర దర్శనం, సాయంత్రం శ్రీపురం శ్రీ లక్ష్మీదేవి అమ్మవారి గోల్డెన్ టెంపుల్ దర్శనం ఉంటుందన్నారు. అదే రోజు రాత్రి బయలుదేరి 7న పౌర్ణమి రోజు ఉదయం అరుణాచలం చేరుకుని గిరి ప్రదక్షిణ, స్వామి వారి దర్శనం ఉంటుందన్నారు. అనంతరం అదే రోజు సాయంత్రం బస్సు బయలుదేరి 8న ఉదయం 8 గంటలకు గూడెం చేరుకుంటుందని వెల్లడించారు. టికెట్ ధర ఒకరికి రూ 2,600గా నిర్ణయించామన్నారు. అడ్వాన్స్ బుకింగ్ కోసం ఆన్‌లైన్ సౌకర్యం ఉందన్నారు.

సైన్స్ ఫెయిర్‌లో జిల్లాకు ద్వితీయ స్థానం

యలమంచిలి : విజయవాడలో నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌లో పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి మండలం మట్లపాలెం జిల్లా పరిషత్ హైస్కూలు విద్యార్థి సీహెచ్ లీల సత్య శ్రీనాథ్ సాఫ్ట్‌వేర్ అండ్ యాప్స్ విభాగంలో ద్వితీయ స్థానం సాధించాడు. పాఠశాల సిబ్బంది మంగళవారం ఈ విషయం వెల్లడించారు.


ఆక్వాకు ఆర్థిక దన్ను

పూర్తయిన 'ఆక్వా జోనేషన్' రీ సర్వే

- ఉమ్మడి జిల్లాలో 13,107 సర్వీసులకు విద్యుత్ రాయితీ
- ఈ-ఫిష్ సర్వేలో లోపాల సవరణ



చేపల, రొయ్యల చెరువులు



నిడమర్రు మండలంలో ఆక్వాజోన్ మ్యాప్

కైకలూరు: ఆక్వా రంగానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్థిక దన్నును అందిస్తున్నారు. అర్హులైన ఆక్వా రైతులకు మరిన్ని ప్రయోజనాలు చేకూర్చడానికి 'ఆక్వా జోనేషన్' రీ సర్వే చేపట్టారు. ఉమ్మడి పశ్చిమగోదావరి **జిల్లాలో ఈ-ఫిష్** సర్వేలో చిన్నపాటి లోపాల**ను సవరించి రైతులందరికీ విద్యుత్ రాయితీ సర్వీసు**ల **పునరుద్ధరణకు** అవకాశం కల్పించారు. **ఆక్వా జోనేషన్** రీ సర్వే ఆధారంగా రైతుల **సాగు అనుమ**తికి ధ్రువీకరణ పత్రాల**ను అంది**స్తున్నారు. మేతల ధరలను **తగ్గించడంతో** పాటు ఆక్వా ఉత్పత్తుల**కు గిట్టుబాటు** ధర కోసం ప్రభుత్వం చేసిన **కృషిని రైతులు** అభినందిస్తున్నారు.

29 మండలాల్లో..

రాష్ట్రంలో 13 జిల్లాల పరిధి**లో** ఈ-ఫిష్ సర్వే ప్రకారం నాన్ ఆక్వా జోన్ 1,93,062.2062 ఎకరాల్లో **విస్తరించి ఉం**ది. ఇందులో 10 ఎకరాల క**ంటే తక్కువ** విస్తీర్ణంలో 1,35,496.8142**2 ఎకరాలు,** 10 ఎకరాల కంటే ఎక్కువ **విస్తీర్ణంలో** 57,565.3925 ఎకరాలు ఉన్నాయి. అలాగే ఏలూరు జిల్లాలో 82,425.8481 ఎకరాలు, పశ్చిమగోదావరి జిల్లాలో 67,044.4004 ఎకరాల్లో ఆక్వా సాగు చేస్తున్నారు. ఏలూరు జిల్లాలో 10 ఎకరాల కంటే తక్కువ నాన్ ఆక్వాజోన్ పరిధి 43,156.34 ఎకరాలు ఉండగా, 10 ఎకరాల కంటే ఎక్కువ విస్తీర్ణంలో 12,924.61 ఎకరాలను గుర్తించారు. ఏలూరు జిల్లాలో 11 మండలాలు, పశ్చిమగోదావరి జిల్లాలో 18 మండలాల్లో ఆక్వా జోనేషన్ ప్రక్రియ జరిగింది.

56 వేల ఎకరాలకు ఆమోదం

ఏలూరు జిల్లాస్థాయి కమిటీ (డీఎల్‌సీ)లో నాన్ ఆక్వా జోన్ నుంచి ఆక్వా జోన్‌లోకి 56,080.92 ఎకరాలకు ఆమోదం తెలుపుతూ కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలో వేగంగా డీఎల్‌సీలో నాన్ ఆక్వాజోన్ విస్తీర్ణం ప్రక్రియ పూర్తి చేసిన జిల్లాగా ఏలూరు నిలిచింది. ఏలూరు జిల్లాలోని 11 మండలాల్లో 10 ఎకరాలలోపు ఆక్వా రైతులు 27,788 మంది ఉండగా, 10 ఎకరాల కంటే ఎక్కువ విస్తీర్ణం ఉన్న రైతులు 30,856 మంది ఉన్నారు. జిల్లాలో అధికంగా కైకలూరు మండలంలో 13,681 సర్వే నంబర్లకు చెందిన 3,358 రైతులు నాన్ ఆక్వా జోన్ నుంచి ఆక్వాజోన్‌లోకి మారే అవకాశం ఉంది.

రూ.2,403 కోట్ల విద్యుత్ రాయితీ

దేశ చరిత్రలో తక్కువ ధరకు ఆక్వా రైతులకు విద్యుత్ సబ్సిడీ అందిస్తున్న రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలిచింది. సుదీర్ఘ పాదయాత్రలో సీఎం జగన్‌కు ఆక్వా రైతులు విద్యుత్ చార్జీల మోతను వివరించారు. ఆయన అధికారంలోకి రాగానే విద్యుత్ యూనిట్‌ను రూ.1.50కు అందించారు. టీడీపీ పాలనలో యూనిట్ ధర రూ.3.85 ఉండగా ప్రస్తుతం రూ.1.50 తగ్గగా రాయితీ రూ.2.35 వర్తిస్తోంది. ఇలా మూడేళ్లలో రూ.2.403 కోట్లు విద్యుత్ రాయితీ రూపంలో ఆక్వా రైతులకు అందించారు. గతేడాది విద్యుత్ సబ్సిడీని 5 ఎకరాలకు పరిమితం చేయగా, ఏలూరు జిల్లా గణపవరంలో రైతు భరోసా కార్యక్రమానికి విచ్చేసిన సీఎం జగన్ ఈ పరిమితిని 10 ఎకరాల వరకు విస్తరిస్తూ ప్రకటించారు. దీంతో మరింత మంది విద్యుత్ రాయితీకి అర్హత సాధించారు.

మరిన్ని ప్రయోజనాలు



నాన్ ఆక్వాజోన్ నుంచి ఆక్వా జోన్‌లోకి మారితే చాలా ప్రయోజనాలు వర్తిస్తాయి. ఆక్వాజోన్‌లో గుర్తిస్తే చెరువు తవ్వకాల అనుమతులు అప్పుడా చట్టం ద్వారా త్వరగా అందుతాయి. నాన్ ఆక్వాజోన్‌లో ఉంటే జిల్లా స్థాయి కమిటీల నుంచి అనుమతులు రావాల్సి ఉంటుంది. ఏలూరు జిల్లాలో రెవెన్యూ శాఖ సహకారంతో త్వరగా ఆక్వా జోనేషన్ సర్వే పూర్తి చేశాం.

– ఈశ్వర చంద్ర విద్యాసాగర్, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి, ఏలూరు

సీఎం మేలును మరువలేం



ఆక్వా రంగాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని విధాలా ఆదుకుంటున్నారు. కరోనా కష్టకాలంలో ఆక్వా ఉత్పత్తుల రవాణాకు అవకాశం కల్పించారు. ఆక్వా రైతులకు విద్యుత్ సబ్సిడీ అందిస్తున్నారు. విద్యుత్ సబ్సిడీ పరిమితిని 5 ఎకరాల నుంచి 10 ఎకరాలకు పెంచారు. ఆక్వా మేతల ధరలు తగ్గింపు, ఉత్పత్తులకు గిట్టుబాటు కల్పిస్తున్న ప్రభుత్వ చర్యలు అభినందనీయం.

– ముంగర నరసింహరావు, ఆక్వారైతు, ఆకివీడు

ముందస్తు బుకింగ్‌కు అదనపు రుసుం రద్దు

శ్రీవారి భక్తుల హర్షం



ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో దేవస్థానం గదులు, కాటేజీల అడ్వాన్స్ రిజర్వేషన్లకు ఇక భక్తులు అదనపు రుసుం చెల్లించక్కర్లేదు. గతంలో వాటిని అడ్వాన్స్ రిజర్వేషన్ చేసుకునేవారు సాధారణ అద్దెకు మరో 50 శాతం అదనంగా చెల్లించేవారు. రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ఆదేశాలతో భక్తులకు ఈ భారం తగ్గింది. చినవెంకన్న క్షేత్రాన్ని నిత్యం వేలాది మంది సందర్శిస్తుంటారు. శని, ఆదివారాలు, ఇతర పర్వదినాల్లో ఈ సంఖ్య మరింత ఎక్కువగా ఉంటుంది. వివాహాది శుభకార్యాలు కూడా అధికంగా జరుగుతుంటాయి. వాటిని పురస్కరించుకుని భక్తులు రూంలు, కాటేజీలను ముందస్తుగా రిజర్వేషన్ చేసుకుంటారు. గతంలో వీటిని అడ్వాన్స్ రిజర్వేషన్ చేసుకోవాలంటే సాధారణ రుసుంకు 50 శాతం అదనంగా చెల్లించాల్సి వచ్చేది. ఇది భక్తులకు భారంగా మారిందని, అదనపు భారాన్ని తొలగించాలని దేవదాయశాఖ మంత్రి సంబంధిత అధికారులను ఇటీవల ఆదేశించారు. దాంతో అడ్వాన్స్ రిజర్వేషన్లపై అదనపు రుసుం వసూలను అధికారులు రద్దు చేశారు. గతంలో కొండపైన ధర్మ అప్పారాయ నిలయంలో అడ్వాన్స్ రిజర్వేషన్ ద్వారా నాన్ ఏసీ గదిని పొందాలంటే రూ. 1,200, ఏసీ గదికి రూ. 1,600, నాన్ ఏసీ సూట్ రూమ్‌కు రూ.1,600, ఏసీ సూట్ రూంకు రూ. 2,020 చెల్లించాల్సి వచ్చేది. ప్రస్తుతం నాన్ ఏసీ గదికి రూ.700, ఏసీ గదికి రూ. 950, నాన్ ఏసీ సూట్ రూమ్‌కు రూ. 950, ఏసీ సూట్ రూమ్‌కు రూ. 1,350 లు చెల్లిస్తే సరిపోతుంది. కాటేజీలు, మిగతా సత్రాల్లోని గదుల రిజర్వేషన్లకు అదనపు రుసుం చెల్లించక్కర్లేదని ఆలయ అధికారులు తెలిపారు. క్షేత్రంలో వివాహాలు, ఉపనయనాలు, అన్నప్రాసనలు, అక్షరాభ్యాసాలు ఎక్కువగా స్వామివారి అనివేటి మండపంలోనే జరుగుతాయి. గతంలో ముందస్తుగా రిజర్వేషన్‌కు రూ.1,250 చెల్లించాల్సి వచ్చేది. ప్రస్తుతం రూ.1000 చెల్లిస్తే సరిపోతుంది.

ట్రాఫిక్ నియంత్రణకు సమష్టిగా కృషిచేయాలి



భీమవరం ట్రాఫిక్‌పై సమీక్షలో మాట్లాడుతున్న ఐఐటీ మాజీ డైరెక్టర్ డాక్టర్ వీఎస్ రాజు

సాక్షి, భీమవరం: జిల్లా కేంద్రమైన భీమవరం పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణలో రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచేలా విద్యాసంస్థలు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ వంటి సంస్థలు కలిసి కృషిలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఐఐటీ ఢిల్లీ మాజీ డైరెక్టర్ డాక్టర్ వీఎస్ రాజు పేర్కొన్నారు. భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో పట్టణంలోని ప్రముఖ విద్యాసంస్థల ప్రిన్సిపాల్స్, పోలీస్ ఉన్నతాధికారులు, ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో సమీక్ష సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీఎస్ రాజు మాట్లాడుతూ పట్టణంలో ధ్వని, వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు విద్యార్థుల ద్వారా అవగాహన కల్పించాలన్నారు. అవసరమైన చోట్ల ట్రాఫిక్ సిగ్నల్స్‌ని ఏర్పాటు చేసి పోలీస్ పోస్ట్ ఏర్పాటు చేయాలని సూచించారు. అడిషనల్ ఎస్పీ డి.సుబ్బరాజు మాట్లాడుతూ ప్రస్తుతం పోలీస్ శాఖ ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఫైన్‌లు కట్టించుకోవడానికి బదులు వారిలో చైతన్యం తీసుకువచ్చేందుకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. హెల్మెట్ల వాడకం గతం కన్నా 15% పెంచినట్లు ఆయన పేర్కొన్నారు. విద్యాసంస్థలు విద్యార్థులు తమకు సహకారం అందించాలని కోరారు. పట్టణ ట్రాఫిక్ సీఐ దాస్ మాట్లాడుతూ నో హారన్ వంటి సైన్ బోర్డుల ఏర్పాటుతో మంచి ఫలితాలు వస్తాయని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ సైన్స్ అండ్ టెక్నాలజీ మాజీ శాస్త్రవేత్త డాక్టర్ ప్రసాద్ రాజు మాట్లాడుతూ ట్రాఫిక్ నియంత్రణ, పొల్యూషన్ రహిత పట్టణాలకు సంబంధించి ఏపీసీటీఈ ప్రత్యేక శ్రద్ధ తీసుకుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఆర్‌కెఆర్ కళాశాల సెక్రటరీ సాగి నిశాంత్ వర్మ, ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.జగపతి రాజు, విష్ణు ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, డీఎన్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.అంజన్ కుమార్, డీఎన్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.ఎస్, శాంతకుమారి, డాక్టర్ పి.ఏ రామకృష్ణంరాజు, వివిధ రంగాల నిపుణులు పాల్గొన్నారు.

సాగునీటి కొరత లేకుండా చూడాలి

కలెక్టర్ పి.ప్రశాంతి



కాళ్లలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

కాళ్ల: వరి రైతులకు సాగునీటి కొరత లేకుండా చూడాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. పంట పొలాలకు సాగునీరు అందించాలంటూ వరి దుబ్బులతో తహసీల్దార్ కార్యాలయం ముందు కాళ్ల గ్రామానికి చెందిన రైతులు సోమవారం ధర్నా చేసిన నేపథ్యంలో కలెక్టర్ ప్రశాంతి ఇరిగేషన్ అధికారులతో కలిసి మంగళవారం పంట పొలాలను పరిశీలించారు. సుమారు 15 రోజుల నుంచి పంట కాలువలో చుక్కనీరు రావటం లేదని, నీరు లేక తమ పొలాలన్నీ నెర్రలు తీసి ఎండిపోయాయని ఈ సందర్భంగా పలువురు రైతులు కలెక్టర్ ముందు వాపోయారు. ఇరిగేషన్ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని కన్నీటి పర్యంతమయ్యారు. కె.లంక పంట కాలువని ఆనుకుని ఉన్న రొయ్యల, చేపల చెరువుల యజమానులు విద్యుత్ మోటార్ల ద్వారా నీటి చౌర్యానికి పాల్పడుతున్నా ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దాళ్వా పంట ఆదిలోనే నీటిఎద్దడి ఇలా ఉంటే పంట సమయానికి తమ పరిస్థితి ఏంటని కలెక్టర్‌కి విన్నవించుకున్నారు. అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయానికి సాగునీరు అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఆక్వా చెరువులకు పంట కాలువ నుంచి తోడుతున్న విద్యుత్ మోటార్లను అవసరమైతే సీజ్ చేయాలని ఆదేశించారు. ఇరిగేషన్ ఏఈ ఫణిశంకర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. రానున్న రెండు రోజుల్లో పంట పొలాలకు పూర్తిస్థాయిలో నీరు అందించేలా ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా జలవనరుల శాఖ అధికారి పి.నాగార్జున, ఇరిగేషన్ ఈఈ దక్షిణామూర్తి, డీఈలు పి.ఎస్.వి.వి.ఎస్ మూర్తి, ఎ.వెంకటేశ్వరరావు, ఏఈలు ఫణిశంకర్, పెద్దిరాజు, తహసీల్దార్ టి.ఎ.కృష్ణారావు, ఆర్ఐ రాఘవమూర్తిరాజు, ఏవో సిహెచ్.జయవాసుకి, ఇరిగేషన్, రెవెన్యూ, వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఒక్క ఎకరా ఎండిపోకూడదు

ఉండి: సాగునీటి కొరతతో ఒక్క ఎకరా కూడా ఎండిపోయే పరిస్థితి రాకూడదని ఇరిగేషన్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఉండి మండలం చెరుకువాడ శివారు ప్రాంతాలకు సాగునీరు అందడం లేదని రైతుల ఫిర్యాదు మేరకు మంగళవారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. సర్పంచ్ కొండవేటి సాంబశివరావు ఆధ్వర్యంలో రైతులు తమ ఇబ్బందులను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఇరిగేషన్ అధికారులతో మాట్లాడిన రైతుల సమస్యను వెంటనే పరిష్కరించారు. ఏ ఏ ప్రాంతాలకు సాగునీరు అందుతుందో తప్పకుండా పరిశీలన చేస్తూ రైతులతో సమన్వయం చేసుకోవాలన్నారు. ప్రస్తుతం గోదావరి డెల్టాకు 4 వేల క్యూసెక్కుల సాగునీరందుతుందని మరో 500 క్యూసెక్కుల నీరు విడుదల చేయాలని కోరతామన్నారు. మెరక ప్రాంతాలకు సాగునీరందేలా కాలువలోని నీటి మట్టాన్ని నిలగట్టాలని సూచించారు. అలాగే వంతులవారీ విధానంలో నీరందించే సమయానికి కంటే మరింత సమయం పెంచి శివారు ప్రాంతాలకు నీరందించాలని ఆదేశించారు. అనధికార మోటార్లను సీజ్ చేయాలన్నారు. గ్రామాల్లోని మంచినీటి చెరువులను పూర్తిస్థాయిలో నింపాలని వేసవిలో తాగునీటి సమస్యలు రాకుండా చూడాలని కలెక్టర్ ప్రశాంతి అధికారులను ఆదేశించారు.

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీల గెలుపు ఖాయం



సమావేశంలో మాట్లాడుతున్న ఆళ్ల నాని వేదికపై ఎమ్మెల్సీ అభ్యర్థులు కవురు శ్రీనివాస్, వంక రవీంద్రనాథ్

ఏలూరు జిల్లా పార్టీ అధ్యక్షుడు ఆళ్ల నాని

ఏలూరు టౌన్: రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు సముచిత స్థానం కల్పిస్తూ సామాజిక న్యాయమంటే ఇదేనని నిరూపించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఏలూరు జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. ఏలూరు శ్రీరామ్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ ఎన్నికల అభ్యర్థులు కవురు శ్రీనివాస్, వంక రవీంద్రనాథ్‌లతో కలిసి నగరపాలక సంస్థ ప్రజాప్రతినిధులతో మంగళవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. నగర మేయర్ షేక్ నూర్జహాన్ ఆధ్వర్యంలో కార్పొరేషన్‌కు చెందిన ప్రజాప్రతినిధులతో ఈ పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆళ్ల నాని మాట్లాడుతూ ... రాష్ట్రంలో బలహీనవర్గాలు, అణగారిన వర్గాలకు ప్రాధాన్యత ఇస్తూ సామాజిక విప్లవానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాంది పలికారని చెప్పారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలతోపాటు, పార్టీ విధేయులకు పెద్దపీట వేస్తున్నారని ఆయన తెలిపారు. మార్చి 13న జరగబోయే స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తొలి ప్రాధాన్యత ఓటును వైఎస్సార్‌సీపీ బలపర్చిన అభ్యర్థులకు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే నాని సూచించారు. ఎమ్మెల్సీ అభ్యర్థి కవురు శ్రీనివాస్ మాట్లాడుతూ తన రాజకీయ జీవితంలో ఆళ్ల నాని అందించిన ప్రోత్సాహం మరువలేనిదన్నారు. సీఎం ఆశీస్సులతో, ఆళ్ల నాని అండతో గ్రామస్థాయి నుంచి జిల్లా పరిషత్ చైర్మన్ అయ్యానని, ఇప్పుడు ఎమ్మెల్సీగా చట్టసభలో అడుగుపెట్టే అదృష్టం కల్పించిన నాయకులకు రుణపడి ఉంటానని తెలిపారు. ఎమ్మెల్సీ అభ్యర్థి వంక రవీంద్రనాథ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి, ఆళ్ల నానికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్‌బాబు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఎమ్మెల్సీ ఎన్నికలు

సమీక్షా సమావేశంలో రిటర్నింగ్ అధికారి పి.అరుణ్‌బాబు



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న రిటర్నింగ్ అధికారి, జేసీ పి.అరుణ్‌బాబు

ఏలూరు(మెట్రో): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ పి.అరుణ్‌బాబు అదేశించారు. ఎన్నికల నిర్వహణ అంశంపై మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమీ సమావేశ మందిరంలో రిటర్నింగ్ అధికారి, జేసీ పి.అరుణ్‌బాబు నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణకు సంబంధించి సిబ్బంది, శిక్షణ, ఎన్నికల సామాగ్రి, బ్యాలెట్ పేపర్లు, రవాణా నిర్వహణ, బ్యాలెట్ బాక్సుల ప్రొక్యూర్‌మెంట్, మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్, స్ట్రాంగ్ రూం, కౌంటింగ్, మైక్రో అబ్జర్వర్స్ నియామకం, శాంతి భద్రతలు, తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశ్చిమ గోదావరి స్థానిక సంస్థల నియోజకవర్గం నుంచి శాసనమండలికి ఇద్దరు సభ్యుల కోసం ఆరుగురు అభ్యర్థులు పోటీలో ఉన్నారన్నారు. మార్చి 13న ఎన్నికల నిర్వహణకు ఏలూరు, జంగారెడ్డిగూడెం, కొవ్వూరు, భీమవరం, నర్సాపురం మండల కేంద్రాల్లో పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశామన్నారు. మార్చి 16న కౌంటింగ్ జరుగుతుందన్నారు. ఈ ఎన్నికల్లో 1,105 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకుంటారని చెప్పారు. పోలింగ్ ఏర్పాట్లను సంబంధిత సబ్ కలెక్టర్లు, ఆర్డీఓలు ముందస్తుగా పరిశీలించాలన్నారు. నిర్దేశిత సమయంలో ఎన్నికల సామగ్రి తరలించడం, బ్యాలెట్ పేపర్ల ముద్రణ పూర్తిచేయాలన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడం, నియమావళి ఉల్లంఘన వంటి వాటిపై గట్టి నిఘా ఉంచాలన్నారు. ఎన్నికల నిర్వహణకు ఏర్పాటు చేసిన 48 ఫ్లయింగ్ స్క్వాడ్స్ పూర్తిస్థాయిలో పనిచేయాలన్నారు. అవసరమైన చోట్ల చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలన్నారు. బ్యాలెట్ ముద్రణలో నాణ్యతతోపాటు ఎన్నికల కమిషన్ నిర్దేశించిన కొలతల మేరకు ముద్రణ చేయాలన్నారు. ఎన్నికలు ముగిసే వరకు శాంతి భద్రతలను కాపాడేందుకు పటిష్ట బందోబస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఓట్ల లెక్కింపుపై సంబంధిత సిబ్బందికి నమూనా బ్యాలెట్ పేపర్లతో శిక్షణ అందించాలన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి సంబంధిత సబ్ కలెక్టర్, ఆర్డీఓలు ఆయా ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లతో ఒకరోజు సమావేశం నిర్వహించాలన్నారు. సమావేశంలో ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లా రెవిన్యూ అధికారులు, పోలీసు అధికారులు, ఆర్డీఓలు, ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చిన్నారులను పరామర్శించిన డీఈఓ



తణుకులో చిన్నారులను పరామర్శిస్తున్న డీఈఓ వెంకటరమణ

తణుకు: మధ్యాహ్న భోజనం తిని అస్వస్థతకు గురైన చిన్నారులకు జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటరమణ మంగళవారం పరామర్శించారు. పట్టణంలోని ఆరో నంబర్ మున్సిపల్ పాఠశాలలో భోజనం తిని 15 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. వీరంతా తణుకు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొంది క్షేమంగా ఇంటికి చేరుకున్నారు. మంగళవారం తణుకు విచ్చేసిన డీఈవో వెంకటరమణ విద్యార్థుల నివాసాలకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. డీఈవో వెంట మండల విద్యాశాఖ అధికారి ఎస్.శ్రీనివాసరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సీహెచ్ శ్రీనివాస్, సీఆర్పీ అనిలకుమారి పాల్గొన్నారు.

12 టన్నుల ఇసుక సీజ్

ఆకివీడు: దుంపగడప గ్రామంలోని ఒక ఖాళీ ప్రదేశంలో ఇసుక అక్రమంగా విక్రయిస్తున్నట్లు ఎస్ఈబీ సీఐ డీటీఎఫ్ కె.కోటేశ్వరరావు మంగళవారం ఆకస్మిక తనిఖీ చేసి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కే.రాజారెడ్డి చెప్పారు. సుమారు రూ. 9 వేల విలువైన 12 టన్నుల ఇసుకను సీజ్ చేశామని ఎస్సై తెలిపారు.

ఫోన్ పోతే.. కనిపెట్టేస్తారంతే!

- 91549 66503 వాట్సాప్ నంబర్‌కు ఫిర్యాదుతో నిశ్చింత
- సెల్‌ఫోన్ ట్రాకింగ్ సిస్టమ్‌తో ఎక్కడున్నా పట్టేస్తున్న పోలీసులు
- జిల్లాలో మూడు విడతల్లో 442 ఫోన్లు బాధితులకు అప్పగింత



రికవరీ చేసిన ఫోన్లను పోగొట్టుకున్న బాధితులకు అందిస్తున్న ఎస్పీ రవిప్రకాష్

సాక్షి, భీమవరం: నేడు సెల్‌ఫోన్ లేనిదే బయటకు అడుగుపెట్టలేని పరిస్థితి. ప్రధానంగా ఆండ్రాయిడ్ ఫోన్ల వినియోగం ఎక్కువైంది. వీటి ఖరీదు కూడా ఎక్కువే. కొంతమంది ధనవంతులు ఐఫోన్ వంటి రూ.లక్షల విలువ చేసే ఫోన్లను వినియోగిస్తుంటే సామాన్యులు సైతం కనీసం రూ.10 వేల విలువైన ఫోన్స్ వాడుతున్నారు. వీటిల్లో అన్నిరకాల ఫీచర్స్ అందుబాటులో ఉండాలంటే ఆ మాత్రం ఖరీదైన సెల్‌వాడకం తప్పనిసరిగా మారింది. ఈ నేపథ్యంలో ఫోన్ పోగొట్టుకున్నా లేదా చోరీకి గురైతే ఆ వేదన వర్ణనాతీతం. ఫోన్ పోయిందనే బాధ కంటే అందులో ఉండే ముఖ్యమైన వ్యక్తుల నంబర్లు, ఎంతో విలువైన సమాచారం, ఎన్నో జ్ఞాపకాలను కోల్పోతాం. గతంలో ఫోన్ పోగొట్టుకుంటే తిరిగి వాటిని పొందడం కష్టమే. కొంతమంది బాధితులు పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేస్తుండగా, మరికొంతమంది పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిరగలేక మిన్నకుండిపోతున్నారు. దీనిని ఆసరాగా చేసుకుని సెల్‌ఫోన్ దొరికిన వారికి లేదా దొంగిలించిన వారు ఫోన్ తమదేనని ధీమాగా వినియోగించుకోవడం సర్వసాధారణమైంది. ఇటువంటి వారికి చెక్ పెడుతూ ఇటీవల పశ్చిమగోదావరి జిల్లా పోలీసులు అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు ఎక్కడున్నా రికవరీ చేసి బాధితులకు అందిస్తూ శభాష్ అనిపించుకుంటున్నారు.

ఫిర్యాదు చేసినా కొద్దిరోజుల్లోనే రికవరీ

సెల్‌ఫోన్ పాగొట్టుకున్న బాధితులు పోలీసులకు వాట్సాప్ మేసేజ్ ద్వారా ఫిర్యాదు చేసిన కొద్దిరోజుల్లోనే పోలీసుశాఖ నూతనంగా ప్రవేశపెట్టిన సెల్‌ఫోన్ ట్రాకింగ్ సిస్టమ్ ద్వారా సెల్‌ఫోన్ ఎంత దూరప్రాంతంలో వినియోగిస్తున్నా కనిపెట్టి బాధితులకు అందజేస్తున్నారు. ఈ విధంగా జిల్లాలో సుమారు రూ.66.33 లక్షల విలువైన 442 సెల్‌ఫోన్లను పోలీసులు రికవరీ చేసి బాధితులకు అప్పగించారు.

సెల్ ఫోన్ ట్రాకింగ్ సిస్టమ్‌తో గుర్తింపు

సెల్‌ఫోన్ పాగొట్టుకున్నవారికి పోలీసు శాఖ మంచి అవకాశం కల్పించింది. పోగొట్టుకున్న ఫోన్ వివరాలను 91549 66503 వాట్సాప్ నంబర్‌కు 'హెచ్‌ఐ' అనే మెసేజ్ చేస్తే చాట్‌బోట్ మెసేజింగ్ పద్ధతి ద్వారా ఒక లింక్ ఆటోమెటిక్‌గా వస్తుంది. ఆ లింక్‌ను ఓపెన్ చేసి ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తి వివరాలతో పాటు ఫోన్ వివరాలను సబ్‌మిట్ చేస్తే పోగొట్టుకున్న సెల్‌ఫోన్ వివరాలతో ట్రాక్ చేస్తారు. దీనికిగాను జిల్లాలో ప్రత్యేక సెల్‌ఫోన్ ట్రాకింగ్ బృందాన్ని ఎస్పీ యు.రవిప్రకాష్ ఏర్పాటు చేశారు. దీనిలో దిశా పోలీసు స్టేషన్‌కు సంబంధించిన ఎస్సైతో పాటు ఐదుగురు కానిస్టేబుళ్లు, ఐటీ డిపార్టుమెంట్‌కు చెందిన ముగ్గురు పనిచేస్తుంటారు. బృందం మొత్తం సభ్యులు తమ రోజువారి విధి నిర్వహణతోపాటు ఫోన్ల రికవరీని కూడా చేస్తుంటారు. ఇప్పటివరకు జిల్లాలో మొదటి విడతలో 157, రెండో విడతలో 105, మూడో విడతలో 180 ఫోన్లను బాధితులకు అందజేశారు. దీంతో సెల్‌ఫోన్ పాగొట్టుకున్న బాధితుల నుంచి ఎక్కువగా ఫిర్యాదులు వస్తుండటం విశేషం.

దొరికిన ఫోన్ వినియోగిస్తే చర్యలు



జిల్లాలో సెల్‌ఫోన్ ట్రాకింగ్ బృందం ఏర్పాటు చేసిన తరువాత ఇప్పటివరకు రూ.66.33 లక్షల విలువైన 442 ఫోన్లు రికవరీ చేసి బాధితులకు అందజేశాం. ఫోన్ పోగొట్టుకున్న బాధితులు ఒకసారి ఫిర్యాదు చేసి చేతులు దులుపుకోకుండా కొన్ని రోజుల వ్యవధిలో తిరిగి ఫిర్యాదు చేయాలి. సెల్‌ఫోన్ ఎవరికైనా దొరికితే పోలీసుస్టేషన్లలో అందజేయాలి. దొరికిన ఫోన్‌ను అక్రమంగా వినియోగించినా, ఎటువంటి ఆధారాలు లేకుండా కొనుగోలు చేసినా చర్యలు తప్పవు.

– యు.రవిప్రకాష్, ఎస్పీ, భీమవరం

నెల లోపే ఫోన్ తిరిగిచ్చారు



నేను వీరవాసరంలో ఒక షాపు వద్ద వెళ్లి నా ఫోన్ మర్చిపోయి వచ్చేశా. తరువాత వెళ్లి వెతికితే కనిపించలేదు. దీంతో పోలీసు వాట్సాప్ నంబర్‌కు ఫిర్యాదు చేస్తే కేవలం నెల లోపే నాఫోన్ తిరిగిచ్చారు. రికవరీ చేసిన పోలీసు శాఖకు కృతజ్ఞతలు.

– పాలా చంద్రరావు, వీరవాసరం

ఎంతో సంతోషంగా ఉంది



డిసెంబర్ 23వ తేదీన అత్తిలి షష్టి తీర్థానికి వెళ్లగా నా సెల్‌ఫోన్‌ను ఎవరో దొంగిలించారు. దీనిపై పోలీసుల వాట్సాప్ నంబర్‌కు ఫిర్యాదు చేశా. కేవలం నెల రోజుల్లోనే నా ఫోన్ నాకు చేరింది. నా ఫోన్ నాకు దొరకడం ఎంతో సంతోషంగా ఉంది.

– బి.రామాంజనేయులు, కొండేపూడి

ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన జేసీ



నరసాపురం ఎంపీడీఓ కార్యాలయంలో ఎమ్మెల్సీ పోలింగ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న జేసీ అరుణ్‌బాబు

నరసాపురం రూరల్: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి నరసాపురం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్‌ను ఏలూరు జిల్లా జాయింట్ కలెక్టర్ అరుణ్‌బాబు మంగళవారం పరిశీలించారు. నరసాపురం రెవెన్యూ డివిజన్‌లోని 10 మండలాలు, నరసాపురం మున్సిపాలిటీలకు సంబంధించి నరసాపురం మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 13వ తేదీన పోలింగ్ నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో కేంద్రంలోని సౌకర్యాలపై జేసీ ఆరా తీశారు. జేసీ వెంట సబ్ కలెక్టర్ సూర్యతేజ, తహసీల్దార్ ఫాజిల్, ఎంపీడీవో ఎస్వీ శివప్రసాద్‌యాదవ్ ఉన్నారు.

యువకుడి అదృశ్యంపై కేసు

ఆకివీడు: అజ్జమూరుకు చెందిన పసుపులేటి నాగసత్యసాయి ఈ నెల 24 నుంచి కనిపించడం లేదని తండ్రి రామాంజనేయులు మంగళవారం ఫిర్యాదు చేసినట్లు ఎస్సై కే.రాజారెడ్డి చెప్పారు. నాలుగు రోజుల నుంచి స్నేహితులు, బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లేకపోవడంతో ఫిర్యాదు చేశారన్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మొగల్తూరులో యువతి..

మొగల్తూరు: తమ కుమార్తె కనపడటంలేదంటూ తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.వీరబాబు మంగళవారం చెప్పారు. మొగల్తూరుకు చెందిన యువతి సోమవారం రాత్రి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు వెతికినా కనిపించకపోవడంతో తండ్రి ఫిర్యాదు చేశారని ఎస్సై తెలిపారు.

గడపగడపకు సంక్షేమం



పెనుగొండ (ఆచంట): ఆచంటలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తున్న ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు

పెట్రోలు కల్తీపై బంక్‌లో తనిఖీలు



తణుకు పాపారావు పెట్రోలు బంకులో తనిఖీలు చేస్తున్న అధికారులు

తణుకు: బంకులో పోయించుకున్న పెట్రోలులో నీళ్ల కలుస్తున్నాయంటూ వాహనదారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణంలోని ఓ బంకులో మంగళవారం తూనికలు, కొలతలు శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. రాష్ట్రపతి రోడ్డులోని హెచ్‌పీసీఎల్ సంస్థకు చెందిన పాపారావు పెట్రోలు బంకులో ఇటీవల రెండు పర్యాయాలు మోటారు సైకిళ్లలో పోయించుకున్న పెట్రోలులో నీళ్లు కలిశాయంటూ ఆరోపణలు వెల్లువెత్తాయి. పెట్రోలు పోయించుకున్న వాహనం కొద్ది దూరం వెళ్లాక ఆగిపోవడంతో మెకానిక్‌కు చూపించిన వాహనదారుడు పెట్రోలు ట్యాంకు నుంచి పెట్రోలు బయటకు తీయించారు. ఈ పెట్రోలులో నీళ్లు కలిసినట్లు నిర్ధారణ కావడంతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో మంగళవారం తూనికలు కొలతలు శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ బీవీ నాగరాజేశ్వరరావు, హెచ్‌పీసీఎల్ సేల్స్ ఆఫీసర్ కె.క్రాంతికుమార్ ఆధ్వర్యంలో బంకులో తనిఖీలు నిర్వహించారు. ముఖ్యంగా నిల్వ ఉంచుకున్న ట్యాంకులు, కొలతలు పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా గాలి, నీరు, మరుగుదొడ్లు అందుబాటులో లేకపోవడాన్ని గుర్తించారు. వచ్చిన ఫిర్యాదుల మేరకు ఉన్నతాధికారులకు నివేదిక అందజేయనున్నట్లు అధికారులు వెల్లడించారు.

వాలీబాల్ పోటీల్లో మూడోస్థానంలో పశ్చిమ

చీపురుపల్లి: విజయనగరం జిల్లా చీపురుపల్లి పట్టణంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వాలీబాల్ ఆహ్వానపు టోర్నమెంట్ విజేతగా యానాం జట్టు నిలిచింది. కనకమహాలక్ష్మి అమ్మవారి 25వ జాతర మహోత్సవాల్లో భాగంగా జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆర్థిక సహకారంతో ఈ నెల 26న రాష్ట్రస్థాయి వాలీబాల్ ఆహ్వానపు టోర్నమెంట్ ప్రారంభించారు. ఈ పోటీల్లో శ్రీకాకుళం, విజయనగరం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, యానాం నుంచి వాలీబాల్ జట్లు పాల్గొన్నాయి. రెండు రోజుల పాటు జరిగిన పోటీల్లో యానాం, కృష్ణా జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి. రెండు జట్ల మధ్య సోమవారం రాత్రి హోరాహోరీగా సాగిన తుదిపోరులో కృష్ణా జిల్లా జట్టుపై యానాం జట్టు విజయం సాధించింది.

విజేతలకు నగదు బహుమతులు

రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌లో ప్రథమ స్థానంలో నిలిచిన యానాం జట్టుకు రూ.30 వేల నగదు బహుమతితో బాటు ట్రోఫీ, ద్వితీయ స్థానంలో నిలిచిన కృష్ణా జిల్లా జట్టుకు రూ.25 వేల నగదుతో బాటు ట్రోఫీని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అందజేశారు. అలాగే తృతీయ స్థానంలో నిలిచిన పశ్చిమ గోదావరి జట్టుకు రూ.20 వేల నగదు, నాలుగో స్థానంలో నిలిచిన శ్రీకాకుళం జట్టుకు రూ.15 వేలు, ఐదవ స్థానంలో నిలిచిన విజయనగరం జట్టుకు రూ.10 వేలు, ఆరో స్థానంలో నిలిచిన తూర్పుగోదావరి జిల్లా జట్టుకు రూ.5 వేల నగదు బహుమతి అందజేశారు.

ఇంటర్ ప్రయోగ పరీక్షకు 11,672 మంది హాజరు

ఏలూరు (ఆర్అర్‌పేట): ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా జరుగుతున్న ప్రయోగ పరీక్షల మూడవ రోజున ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా 11672 మంది విద్యార్థులు హాజరయ్యారు. జనరల్ విద్యార్థులకు సైన్స్ సబ్జెక్టుల్లో జరిగిన పరీక్షకు మంగళవారం 96 కేంద్రాల్లో 8582 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 8417 మంది హాజరయ్యారు. మరో 165 మంది గైర్హాజరయ్యారు. అలాగే 33 కేంద్రాల్లో ఒకేషనల్ విద్యార్థులకు నిర్వహించిన పరీక్షకు 3650 మంది హాజరు కావాల్సి ఉండగా 3255 మంది హాజరయ్యారు. 395 మంది గైర్హాజరయ్యారు. ఈ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని, ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ జరగలేదని ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కే. చంద్రశేఖర బాబు విలేకరులకు తెలిపారు.

డ్వాక్రా సొమ్ము అవినీతిపై విచారణ



ఫిర్యాదుదారుల నుంచి వివరాలను అడిగి తెలుసుకుంటున్న అధికారులు

మొగల్తూరు: డ్వాక్రా మహిళలు ఇచ్చిన సొమ్ములను వారి బ్యాంకు ఖాతాలకు జమ చేయకుండా రూ.నాలుగు లక్షలు అవినీతికి పాల్పడ్డారనే ఆరోపణలపై మండల వైఎస్సార్ ఇందిరా క్రాంతి పథం ఉద్యోగులను ఐకేపీ డీపీఎం పార్థసారథి, ఏపీడీ అనిత కుమారి మంగళవారం విచారణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక ఐకేపీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సీసీ ఎం.సుదర్శనరావు, ఇటీవల బదిలీపై వెళ్లిన డీపీఎం వెంకటేశ్వరరావులపై వచ్చిన ఆరోపణలపై ఫిర్యాదుదారుల నుంచి లిఖితపూర్వకంగా వివరాలు తీసుకున్నామన్నారు. కాళీపట్నం గ్రామానికి చెందిన కుక్కల రవి, పాతపాడు కాళీపట్నం గ్రామాలకు చెందిన డ్వాక్రా మహిళలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ నిర్వహించామని, నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు.

నైపుణ్యశక్తితోనే దేశాభివృద్ధి



విద్యార్థులకు సైన్స్ అంశాలను వివరిస్తున్న నిట్ ఆచార్యులు



జాతీయ సైన్స్‌డేకు వచ్చిన అతిథులతో నిట్ ఆచార్యులు, తదితరులు

నిట్ రిజిస్ట్రార్ దినేష్ శంకరరెడ్డి

తాడేపల్లిగూడెం: నైపుణ్యశక్తితోనే దేశాభివృద్ధి సాధ్యమని ఏపీ నిట్ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ దినేష్ పి.శంకరరెడ్డి అన్నారు. జాతీయ సైన్స్‌డే సందర్భంగా మంగళవారం ఏపీ నిట్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దేశంలోని యువతరాన్ని నిపుణులైన మానవ వనరులుగా తీర్చిదిద్దుకుంటే వారు దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తారన్నారు. సాంకేతికత అందరి ఆకాంక్షను తీర్చే సాధనమన్నారు. ప్రాథమిక స్థాయి నుంచే సాంకేతిక విద్యపై అవగాహన కలిగి ఉండాలన్నారు. సాంకేతిక విద్యపై అవగాహన కల్పించడం ద్వారా విద్యార్థులకు పరిశోధనలపై అభిలాష పెరుగుతుందని, తద్వారా భవిష్యత్‌లో నాణ్యమైన ఆవిష్కరణలు, ఉన్నతమైన పరిశోధనలు ఊపిరి పోసుకుంటాయన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలన్నారు. ఎవరైతే ప్రయోగశాలకు ఎక్కువ సమయాన్ని కేటాయించి ప్రజాహితమైన ఆలోచనలు చేస్తారో వారు తప్పకుండా విజయ శిఖరాలను చేరుకుంటారన్నారు. వరంగల్ నిట్ గణిత విభాగం ఆచార్యులు డాక్టర్ జేవీ రమణమూర్తి మాట్లాడుతూ భారతదేశం గర్వించదగిన శాస్త్రవేత్తల్లో సీవీ రామన్ ఒకరన్నారు. రామన్ ఎఫెక్టు ప్రపంచ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. విద్యార్థులు సైన్సు, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మేథమెటిక్స్ వంటి స్టెమ్ కోర్సులపై పట్టు సాధించాలన్నారు. డీన్‌లు డాక్టర్ జీవీ వీరేష్‌కుమార్, డాక్టర్ ఎస్.జయరామ్, డాక్టర్ టి.కురుమయ్యలు మాట్లాడుతూ విశ్వ శ్రేయస్సు కోసం ప్రపంచ విజ్ఞాన శాస్త్రం ఈ ఏడాది సైన్స్‌డే నినాదమన్నారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్లు అరుణ్‌కుమార్, కృష్ణమూర్తి, తపస్, సుదర్శన్, ద్వివేదీ, రాముడు, నారాయణ, వి.సందీప్, పి.శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రజకులకు రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని వినతి



ఎంపీ మిథున్‌రెడ్డికి వినతిపత్రం అందజేసిన పోసిబాబు

జంగారెడ్డిగూడెం: తాడేపల్లి విల్లాస్‌లో ఎంపీ, ఉమ్మడి గోదావరి జిల్లాల రీజినల్ చైర్మన్ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని ఉమ్మడి గోదావరి జిల్లాల రజక సంఘం అధ్యక్షుడు చాటపర్తి పోసిబాబు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో ఉన్న రజకుల సమస్యలను సానుభూతితో పరిష్కరించాలని, రజకులకు రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని రజక సంఘం నేతలతో కలిసి వినతి పత్రం అందజేశారు. రాష్ట్రంలో రజక సామాజిక వర్గానికి తగిన ప్రాధాన్యత కల్పించే విషయంలో గౌరవ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళతానని హామీ ఇస్తూ, త్వరలో ఉమ్మడి గోదావరి జిల్లాలోని రజకులతో సమావేశం అవుతానని మిథున్‌రెడ్డి పేర్కొన్నట్లు పోసిబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రజక సంఘం నాయకులు రుద్రపాక నాగమల్లేశ్వరరావు, చెన్నూరి రామకృష్ణ, పొట్నూరి రమణ, మాచర్ల ముత్యాలరావు, పేట గిరిబాబు, దెందులూరు ఎంపీటీసీ తాళ్లూరి నాగరాజు, కలపర్రు ఎంపీటీసీ కంబాల నాగరాజు, కోమటికుంట గంగరాజు, పగిళ్ల అనిల్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



తణుకులో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ముస్లిం మైనారిటీ నాయకులు, చిత్రంలో మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ వర్గాలందరికీ పెద్దపీట వేసి వారి ఉన్నతికి పాటుపడ్డారని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు ముస్లిం మైనారిటీ ఆధ్వర్యంలో మంగళవారం తణుకులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ నామినేటెడ్ పదవుల్లో సైతం వెనుకబడిన వర్గాలకు అధికశాతం కేటాయింపులు చేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందని అన్నారు. రాష్ట్ర మైనారిటి ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మెహర్ అన్సారీ మాట్లాడుతూ ముస్లింలకు చేయూతనిచ్చిన ఘనత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డికి దక్కుతుందని, ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరొక రెండడుగులు ముందుకేసి మైనారిటీలకు నామినేటెడ్ పదవులు కేటాయించారని అన్నారు. భవిష్యత్తు ఎన్నికల్లో జగనన్న ప్రభుత్వం వచ్చేందుకు కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, పట్టణ మహిళాధ్యక్షురాలు నూకల కనకదుర్గ, షేక్ బాజీ, సలీం, ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

'టీడీపీ నేత కబ్జా నుంచి నా స్థలాన్ని విడిపించండి'

ఏలూరు (ఆర్అర్‌పేట): నిడమర్రు మండలం బావాయిపాలెంలో తన స్థలాన్ని టీడీపీ నాయకులు కబ్జా నుంచి విడిపించి తనకు అప్పగించాలని వినియోగదారుల హక్కుల ఉద్యమ నేత, వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొబ్బిలి బంగారయ్య మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. తనకు న్యాయం చేయాలని అధికారులను కోరారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఆగిరిపల్లి: ఒంటరితనం భరించలేక మామిడి తోటలో పనిచేస్తున్న ఓ కూలీ పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఈదర గ్రామానికి చెందిన ఉయ్యాల వెంకటేశ్వరరావు చిన్నతనంలోనే తల్లిదండ్రులు దూరమవ్వడంతో మేనమామ వద్ద అన్న తిరపతిరావుతో కలిసి పెరిగాడు. తిరపతయ్యకు నాలుగేళ్ల క్రితం వివాహమైంది. అప్పటి నుంచి శోభనాపురంలోని నల్లూరి నాగమల్లేశ్వరరావుకు చెందిన మామిడి తోటలో కాపలదారుడిగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఒంటరితనంతో మద్యానికి బానిసయ్యాడు. ఎప్పటిలాగే ఫిబ్రవరి 17న మామిడి తోటకు కాపలాగా వెళ్లిన వెంకటేశ్వరరావు ఒంటరితనంతో మనస్తాపానికి గురై పురుగుమందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. మామిడి తోటలో పడి ఉన్న వెంకటేశ్వరరావును చూసి మేనమామ చిట్టిపోతుల కోటయ్య అతని సోదరుడు తిరుపతిరావుకు ఫోన్ చేసి సమాచారం అందించాడు. తిరుపతిరావు తోటలో అపస్మారక స్థితిలో ఉన్న తమ్ముడిని 108లో విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లాడు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ వెంకటేశ్వరరావు మంగళవారం మృతి చెందాడు. ఎస్సై ఎస్.చంటిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

జాతర ఉత్సవాలకు మంత్రి కారుమూరికి ఆహ్వానం



తణుకులో మంత్రి కారుమూరికి పుష్పగుచ్ఛం అందిస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: ఇరగవరం మండలం అర్జునుడుపాలెం గ్రామంలో వేంచేసియున్న పోలేరమ్మ తల్లి జాతర మహోత్సవానికి రావాల్సిందిగా ఆ గ్రామవాసులు రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావును ఆహ్వానించారు. మంగళవారం మంత్రి కారుమూరిని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసిన అర్జునుడుపాలెం గ్రామస్తులు జాతర మహోత్సవం గురించి తెలిపారు.

నెర్రలు తీస్తున్న దాళ్వా పొలాలు



తూర్పువిప్పర్రులో సాగునీరందక ఎండిపోతున్న వరి పొలాలు

ఇరగవరం: మండలంలోని సాగునీరు అందక దాళ్వా వరి చేలు నెర్రలు తీస్తున్నాయని సీపీఐ, జిల్లా రైతు సంఘం నాయకులు నామానా వెంకటేశ్వరరావు తెలిపారు. మంగళవారం తూర్పువిప్పర్రు, కన్నయ్య కుముదవల్లి గ్రామాల్లోని పంట పొలాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దాళ్వా పంట పొలాలకు సాగునీరందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అధికారులు, నాయకులు దృష్టి సారించి సాగు నీరు సక్రమంగా అందేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐకెఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా చింతాలమ్మ వార్షికోత్సవాలు



చింతాలమ్మవారు

పెంటపాడు: మండలంలోని చింతపల్లి గ్రామ దేవత చింతాలమ్మను నూతనంగా ప్రతిష్ఠించి మూడేళ్ల పూర్తి అయిన సందర్భంగా అమ్మవారికి వార్షిక మహోత్సవాలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి గ్రామస్తుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు, నైవేద్యాలు సమర్పించారు. అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

5 నుంచి జట్లపాలెంలో క్రీస్తు సువార్త సభలు

పెంటపాడు: ఈనెల 5 నుంచి జట్లపాలెం గ్రామంలో క్రీస్తు సువార్తస్వస్థత సభలు నిర్వహించనున్నట్లు పడాల వాక్యజ్యోతి మినిస్ట్రీస్ వ్యవస్థాపకురాలు ప్రవక్తిని కొమ్మిశెట్టి అమ్మాజీ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం సభలకు సంబంధించి పోస్టర్లను ఆవిష్కరించారు. కోడూరి బాబ్జి స్థలంలో ప్రతి రోజూ సాయంత్రం 6 గంటలకు నిర్వహించబోయే ఈ సభలను పరిసర గ్రామ విశ్వాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో సేవకులు కె. ఘనరాజు, జాజిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణంలో తనిఖీలు

ఇరగవరం: మండలంలోని పలు ఎరువుల దుకాణాలను తాడేపల్లిగూడెం ఏడీఈ పి.మురళీకృష్ణ మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీలర్స్ అందరు స్టాక్ రిజిష్టర్స్, బిల్లు బుక్స్‌ను, ఎప్పటికప్పుడు అప్‌డేట్‌గా ఉంచాలన్నారు. ఈ పాస్‌కి స్టాక్ రిజిష్టర్ కి వ్యత్యాసం లేకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. రైతులు కొనుగోలు చేసే ప్రతి దానికి బిల్లు తప్పని సరిగా ఇవ్వాలని సూచించారు. ఏంఏవో వై రాఘవేంద్ర, ఎఇవో సురేష్ సిబ్బంది పాల్గొన్నారు.

సైన్సుతోనే సమాజ ప్రగతి



తణుకు శశి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ఏర్పాటు చేసిన సైన్స్ ప్రదర్శనలు

తణుకు టౌన్: రోజువారీ జీవితం సైన్సుతోనే ముడిపడి ఉందని తణుకు ఎస్ఎంవీఎం పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ యలమర్తి రాజేంద్ర బాబు అన్నారు. సర్ సీవీ రామన్ జయంతి సందర్భంగా తణుకు శశి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో సైన్స్ ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు ఏర్పాటుచేసిన ప్రదర్శనలను తిలకించారు. ఉత్తమ ప్రదర్శనలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాదెళ్ల ప్రసాద్, తణుకు శశికాంపస్ ఇన్‌ఛార్జ్ నిమ్మగడ్డ రాజేంద్రప్రసాద్, ఇతర ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

సైన్స్‌పై ఆసక్తి పెంపొందించుకోవాలి

మండలాల్లో ఆకట్టుకున్న సైన్స్ ప్రదర్శనలు



బల్లిపాడులో విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ ప్రదర్శనలు



జాతీయ సైన్స్ దినోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ రమేష్ చంద్రబాబు



కడియద్ద హైస్కూల్‌లో విజేతలకు బహుమతులు అందజేసిన దృశ్యం



పెంటపాడు డీఆర్ గోయంకాలో సలోమి సునీతను సన్మానిస్తున్న దృశ్యం

అత్తిలి: విద్యార్థులు సైన్స్ పట్ల ఆసక్తి పెంపొందించుకుని శాస్త్రవేత్తలు కావాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వైఎస్సార్‌సీఎం దత్ చెప్పారు. అత్తిలి మండలం బల్లిపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో హెచ్‌ఎం దత్ మాట్లాడుతూ విద్యార్థులు సైన్సును బాగా నేర్చుకుని, ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. సీవీ రామన్ మహనీయుడని, ఆయన కనిపెట్టిన రామన్ ఎఫెక్ట్‌తో నోబెల్ బహుమతి పొందిన గొప్ప శాస్త్రవేత్త అని శ్లాఘించారు. ఈసందర్భంగా 6 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు రూపొందించిన సైన్స్ ప్రదర్శలను విద్యార్థులు సందర్శించి తిలకించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పాఠశాల పీసీ చైర్మన్ ఆకుల మురళీకృష్ణ హాజరై సైన్స్ ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాలసుబ్రహ్మణ్యం, ఎస్ పురుషోత్తం, హర్షద్, విజయ్, మాధవరావు పాల్గొన్నారు.

తణుకు టౌన్‌లో : మనిషిలో, సమాజంలో ప్రశ్నించే తత్వం పెరిగినప్పుడు విజ్ఞాన శాస్త్రం అభివృద్ధి పెరుగుతుందని ప్రముఖ వైద్యులు డాక్టర్ బీ రమేష్ చంద్రబాబు చెప్పారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా తణుకులోని ఎస్‌కెఎస్‌డీ మహిళా కళాశాల్లో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈకార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ కరుటూరి రామకష్ణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమేష్ చంద్రబాబు మాట్లాడుతూ మనిషి తనకు కావలసిన వనరులను, నాగరికతను పెంపొందించుకుంటూ చేసే నిరంతర ప్రయత్నమే విజ్ఞాన శాస్త్రమని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ చిట్టూరి సత్య ఉషారాణి, ఏవో డా.డీ సుబ్బారావు, విద్యారినులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ....

జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని తణుకు మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలో సర్ సీవి రామన్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తణుకు వెంకట్రాయపురంలోని మండల పరిషత్ పాఠశాలలో హెచ్‌ఎం పెదపాటి గోపాల కృష్ణ ప్రసాద్ జాతీయ సైన్స్ దినోత్సవం గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామాయణం శ్రీనివాస్, పీసీ కమిటీ చైర్మన్ దుర్గాదేవి, జ్యోతి, అమ్ములు, రామదుర్గాదేవి, లలిత, ప్రశాంతి, తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం రూరల్‌లో : సైన్స్‌లో మొట్టమొదటి నోబెల్‌అవార్డు గ్రహీత సర్ సీవీ.రామన్‌ను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని ప్రధానోపాధ్యాయుడు డీవీవీఎస్.మూర్తి పేర్కొన్నారు. సర్ సీవీ.రామన్ జయంతి సందర్భంగా మంగళవారం మండలంలోని కడియద్ద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు కె.సుశీల, ఎన్.పార్వతి, జె.వెంకటకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

పెంటపాడులో : సైన్స్ పట్ల విద్యార్థులు ఆసక్తిని పెంచుకొని నూతన ఆవిష్కరణలు చేపట్టాలని పెంటపాడు డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. శ్యాంబాబు పేర్కొన్నారు. పెంట పాడులోని స్థానిక కళాశాలలో మంగళవారం సైన్స్‌డే ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు చేసిన ప్రాజెక్టులను పరిశీలించి ప్రత్యేకంగా అభినందించారు. ఉద్యానవర్సిటీ డీన్ ప్రొఫెసర్ ఆర్ సలోమి సునీత ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు. రసాయిన శాస్త్ర విభాగాధిపతి, ఎన్‌సీసీ కో ఆర్డినేటర్ ఎంవీ ప్రేమ్‌సాగర్, జువాలజీ విభాగాధిపతి గంధం వాణి, వైస్ ప్రిన్సిపాల్ పీఎస్ బ్రహ్మచారి, అధ్యాపకులు జాన్‌బాబు పాల్గొన్నారు. అనంతరం సలోమి సునీతను ఘనంగా సన్మానించారు. పెంటపాడు పాలిటెక్నిక్ కళాశాల, ప్రభుత్వ బేసిక్‌స్కూలు, మీనవిల్లూరు జెడ్పీ స్కూల్ తదితర పాఠశాలల్లో సైన్స్‌డే కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.

కర్మాగారాల్లో ఎస్ఈబీ, ఎక్సైజ్ అధికారుల తనిఖీలు



తణుకులో కర్మాగారాల్లో తనిఖీలు చేస్తున్న ఎస్ఈబీ, ఎక్సైజ్ శాఖల అధికారులు

తణుకు: తణుకు పరిసర ప్రాంతాల్లోని పలు కర్మాగారాల్లో ఎస్ఈబీ, ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు మంగళవారం సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఆంధ్రాసుగర్స్, వాన్‌బరీ, ప్లూటస్ కర్మాగారాల్లో ఆర్ఎస్, మిథనాల్ యూనిట్లు తనిఖీ చేసిన అధికారులు సంస్థ యాజమాన్యాలకు పలు సూచనలు చేశారు. రికార్డులను పరిశీలించి నిల్వలను తనిఖీలు చేశారు. ఎలాంటి ప్రమాదాలకు అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలని ముఖ్యంగా ఆర్ఎస్, మిథనాల్ విషయంలో అజాగ్రత్త వల్ల కలిగే దుష్ప్రభావాలను తెలియజేసి ట్యాంకర్లు దిగుమతి, ఎగుమతి సమయాల్లో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ తనిఖీల్లో ఎస్ఈబీ జాయింట్ డైరెక్టర్ ఏటీవీ రవికుమార్, ఎస్ఈబీ అసిస్టెంట్ సూపరింటెండెంట్ సి.భార్గవ, తణుకు ఎస్ఈబీ సీఐ ఆర్.సత్యవతి, ఎస్సై టి.వెంకటేశ్వరరావు, చాగల్లు డిపో ఎస్సైన జీవీవీ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

మాదిగ మహాసంగ్రామ యాత్రకు ఘన స్వాగతం



పట్టణంలో పోలీస్ ఐలాండ్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి నివాళ్లులర్పిస్తున్న నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): మాదిగల మహాసంగ్రామ పాదయాత్ర మంగళవారం రాత్రి గూడెం పట్టణానికి చేరుకుంది. యాత్రకు స్థానిక నాయకులు ఘన స్వాగతం పలికారు. పోలీస్ ఐలాండ్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు. ఎంఆర్‌పీఎస్ జాతీయ అధ్యక్షుడు, ఏయూ ప్రొఫెసర్ డా.మున్నంగి నాగరాజు మాదిగ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సాధనకై మాదిగలు మరో పోరాటానికి సిద్ధం చేయడానికి ఫిబ్రవరి 22వ తేదీన తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ నుంచి యాత్ర ప్రారంభమైనట్లు తెలిపారు. ఈ నెల 14వ తేదీకి అమరావతి చేరుకుంటుందని వెల్లడించారు. ఈ యాత్రలో మహాజన సోషలిస్ట్ పార్టీ ఉమ్మడి జిల్లా సమన్వయ కర్త బయ్యారపు రాజేశ్వరరావు, ఎంఆర్‌పీఎస్ ఉమ్మడి జిల్లా కో కన్వీనర్ పసుపులేటి చిన్నబాబు, మండల కన్వీనర్ యూ.ప్రభాకర్, నాయకులు చెప్పుల వాసు, మెరిపో జాన్‌రాజు, డి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

120 మందికి క్యాన్సర్ నిర్ధారణ ఉచిత వైద్య పరీక్షలు



వైద్య శిబిరంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ యువనేత కొట్టు విశాల్

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆత్మ బంధువులం సేవా సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని మాగంటి కల్యాణ మండపంలో మంగళవారం క్యాన్సర్ నిర్ధారణ కోసం ఉచిత వైద్య శిబిరం జరిగింది. ఉప ముఖ్యమంత్రి తనయుడు, యువనేత కొట్టు విశాల్ మాట్లాడుతూ ప్రజలందరికి సకాలంలో వైద్యం అందించేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కృషిని కొనియాడారు. క్రమ శిక్షణాయుతమైన జీవితంతో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. 120 మందికి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ద్వారకాతిరుమల దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు ముప్పిడి సంపత్ కుమార్, ఆత్మబంధువుల సేవా సంస్థ అధ్యక్షుడు కడియాల పరశురామయ్య, కార్యదర్శి సీతాళం ఉషా కిరణ్, తిరుపాళ్ల సూరిబాబు, బాకా వెంకటేశ్వరరావు, డా.సుంకవల్లి ప్రమీల రాణి, గ్రేసీ క్యాన్సర్ సెంటర్ వైద్యులు, ఆత్మబంధువుల సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని సౌత్ సెక్షన్ పరిధిలో పెంటపాడు, యాగర్లపల్లి విద్యుత్ ఉప కేంద్రాల్లో విద్యుత్ మరమ్మత్తులు నిమిత్తం ఈ నెల 1వ తేదీ బుదవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ నిలుపుదల చేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ వెంకటేశ్వరరావు వెల్లడించారు. టూ టౌన్‌లోని కొబ్బరి తోట, యాగర్లపల్లి, రామచంద్రరావు పేట, బ్రహ్మానందరెడ్డి మార్కెట్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నందున విద్యుత్ వినియోగదారులు తమకు సహకరించాలని అధికారులు కోరారు.

రాజ్యాంగం ప్రకారం చట్టాలను గౌరవించాలి

రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యుడు చెల్లెం ఆనంద్ ప్రకాష్



పెంటపాడు పంచాయతీ కార్యాలయం వద్ద మాట్లాడుతున్న ఎస్సీకమిషన్ రాష్ట్ర సభ్యులు ఆనంద్ ప్రకాష్

పెంటపాడు: రాజ్యాంగం ప్రకారం సమాజంలో అంటరాని తనం పూర్తిగా రూపుమాపి చట్టాలను గౌరవిస్తూ ప్రజలను చైతన్య పరచాలని రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు చెల్లెం ఆనంద్‌ప్రకాష్ పేర్కొన్నారు. పౌరహక్కుల దినోత్సవం పురస్కరించుకొని పెంటపాడు పంచాయతీ కార్యాలయం వద్ద ప్రజల నుద్దేశించి ఆయన మాట్లాడారు. కులవివక్షత లేకుండా ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందరికీ అందాలన్నారు. భారత రాజ్యాంగాన్ని సక్రమంగా అమలు చేయడంలో అధికారులతో పాటు, ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా ఉండాలన్నారు. ఎస్సీ కమిషన్ ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పథకాలు నిరుపేదలకు చేరాలన్నారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్, హౌసింగ్, విద్య, వ్యవసాయ, ఐసీడీఎస్, ఎంపీడీవో సచివాలయ సిబ్బంది తదితర అధికారుల నుంచి ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వం ద్వారా అందుతున్న ఫలాలు, కులవివక్షను శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు, దళితహక్కుల పోరాటసమితి రాష్ట్ర కార్యదర్శి కళింగ లక్ష్మణరావు, న్యాయవాది చెక్కా ఇజ్రాయేలురాజు, ఎస్సై జి.సత్యనారాయణ, ఎంఈవో ఎం. శ్రీనివాస్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దుర్గా భవాని, ఏపీఎం లక్ష్మి, పంచాయతీరాజ్ ఏఈ ఉన్నమట్ల నవీన్, హౌసింగ్ అధికారులు రాజేంద్ర, జయరాజు, ఏఎస్సై కొప్పిశెట్టి సత్యనారాయణ, కార్యదర్శి అనిల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ మహా ధర్నాను విజయవంతం చేయండి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): సీపీఐ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఆయా ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మార్చి 2వ తేదీన విజయవాడలో జరిగే మహా ధర్నాను విజయవంతం చేయాలని మంగళవారం పట్టణంలో సీపీఐ స్థానిక నాయకులు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏరియా కార్యదర్శి మండల నాగేశ్వరరావు, అల్లం నరేంద్ర, తాడికొండ గంగా భవాని, దాస్యం రాము, గొబ్బిళ్ల ధనరాజు, రవి పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌ను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలి



కేంద్ర బడ్జెట్‌పై జరిగిన సదస్సులో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రజలకు వాతలు పెట్టి, కార్పొరేట్లుకు దోచిపెట్టి రాష్ట్రానికి, జిల్లాకు తీరని అన్యాయం చేసిన కేంద్ర బడ్జెట్‌ను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి బి.బలరాం కోరారు. సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో నాయకులు పుట్టా వేణుగోపాల చౌదరి అధ్యక్షతన కేంద్ర బడ్జెట్‌పై సదస్సు జరిగింది. బలరాం మాట్లాడుతూ కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజా వ్యతిరేక, మోసపూరిత బడ్జెట్ అన్నారు. బడ్జెట్ వల్ల ధరలు తగ్గుతాయని ప్రజలు ఆశించారని, వారిని మోదీ ప్రభుత్వం నిరాశ పరిచిందన్నారు. ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విభజనతో నష్టపోయిన రాష్ట్రానికి ప్రత్యేక హోదా లేదని, పోలవరం ప్రాజెక్టుకు నిధులు కేటాయించలేదని, కడప ఉక్కు ఫ్యాక్టరీ సంగతి మరిచిపోయారని ఆరోపించారు. మోదీ ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు రాయితీలిచ్చేలా, పేద, మధ్య తరగతి ప్రజలపై భారాలు మోపేలా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కర్రి నాగేశ్వరరావు, గొన్నాబత్తుల నాగేశ్వరరావు, మడక రాజు, కరెడ్ల రామకృష్ణ, చిటికిన రాము, జవ్వాది శ్రీను, ధనాల వెంకట్రావులు మాట్లాడారు. అల్లం పూర్ణిమ, జి.లక్ష్మి, వి.అప్పారావు, శేషుబాబు, దానయ్య, పోతు శ్రీను, ఎ.ధర్మారావు, రామ్మోహన్‌రావు, కార్మికులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పథకం పనుల తనిఖీ



అత్తిలి మండలం కంచుమర్రులో ఉపాధి హామీ పనులను తనిఖీ చేస్తున్న ఎంపీడీవో

అత్తిలి: జాతీయగ్రామీణ ఉపాధిహామీ పథకంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఎన్ఎంఎంఎస్ హాజరు పట్టీ విధానాన్ని మేట్లు తప్పనిసరిగా నమోదు చేయాలని ఎంపీడీవో వీవీవీఎస్ రామారావు చెప్పారు. అత్తిలి మండలం కంచుమర్రు గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన రెండు మేజర్ కాలువల పూడికతీత పనులను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ కూలీలందరూ ఉదయం 6గంటలకు పని ప్రదేశంలో ఉండేలా చూడాలని ఫీల్డ్ అసిస్టెంట్ తేలి శాంతి స్వరూప్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ జి భాస్కర్, చొప్పల దివ్య, దొంగ నాగశ్రీనివాస్, షేక్ రహీం, తేలి చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

దర్జీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావును సత్కరిస్తున్న టైలర్స్ అసోసియేషన్ నాయకులు



అత్తిలిలో సీనియర్ టైలర్స్‌ను సన్మానిస్తున్న టైలర్స్ సంఘు నాయకులు



విలియమ్స్ హువే విగ్రహానికి నివాళ్లుర్పిస్తున్న టైలర్స్ సంఘం నాయకులు, చింతకాయల సత్యనారాయణ

తణుకు టౌన్: కుట్టు మిషన్ సృష్టించి ప్రపంచ వ్యాప్తంగా అనేక మందికి టైలరింగ్ వృత్తి ద్వారా ఉపాధి కల్పించిన విలియం హో చిరస్మరణీయుడని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాలశాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. మంగళవారం టైలరింగ్ దినోత్సవం సందర్భంగా వేల్పూరులోని అయ్యప్ప నగర్‌లో తణుకు టైలరింగ్ అసోసియేషన్, ది రంగయ్య టైలర్స్ కోఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ తమ ప్రభుత్వం టైలర్ల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. తణుకులో టైలర్ల సంక్షేమానికి ప్రత్యేక భవన నిర్మాణానికి కృషి చేస్తానని చెప్పారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావును టైలర్స్ యూనియన్ పెద్దలు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టైలర్స్ యూనియన్ అధ్యక్షుడు కేడీవీ సుబ్బారావు, రంగయ్య టైలర్స్ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు ముంగండ శ్రీనివాస్, ఇతర నాయకులతో పాటు పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మంగెన సూర్య, వేల్పూరు వైఎస్సార్‌సీపీ నాయకులు రెడ్డి సత్తిరావు, నున్న ప్రసాద్, కరెళ్ల వర ప్రసాద్, రమణమూర్తి, సుబ్రహ్మణ్యం, తణుకు ప్రాంతంలోని టైలర్లు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అత్తిలిలో : టైలర్స్‌డే వేడుకను అత్తిలిలో దర్జీలు మంగళవారం ఘనంగా జరిపారు. మండల టైలర్ల సంఘం ఆధ్వర్యంలో టైలర్స్ అత్తిలి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. మురళీ ఖాజావర్క్ షాపులో కుట్టుమిషన్ సృష్టికర్త విలియమ్స్‌హో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో టైలర్స్‌ను సన్మానించారు. టైలర్స్ సంఘం అధ్యక్షుడు చల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ టైలర్స్ అందరూ సంఘటితంగా ఉండి, సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కొల్లి మోహనరావు, ఆర్ పావనజయకృష్ణ, కసిరెడ్డి వెంకట అప్పారావు, కొండేటి గీత, ఎన్ మురళీమోహనకృష్ణ, దాసరి శ్రీరాములు, పడాల రామచంద్రరావు, తానుకొండ శేఖర్ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం (టీఓసీ)లో: పట్టణంలోని టైలర్ సెంటర్‌లో టైలర్స్ డే వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. కుట్టు మిషన్ సృష్టికర్త విలియమ్స్ హువే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లుర్పించారు. వైఎస్సార్ సీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి చింతకాయల సత్యనారాయణ, టైలర్స్ సంఘం సీనియర్ నాయకులు ఆకాశపు స్వామి, పట్టణ టైలర్స్ సంఘం అధ్యక్షుడు చేపల సత్యనారాయణ, మాదబత్తుల బాబురావు, మల్లేష్, నక్క రాజు, ఎస్.అప్పారావులు మాట్లాడుతూ హువే జీవిత విశేషాలు, టైలర్స్‌గా ఎంతో మందికి ఉపాధి లభిస్తుందని వెల్లడించారు. సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.